# బీసీలకు మొండిచేయి

- మాట తప్పిన కాంగ్రెస్ పార్టీ
- వెనుకబడిన వర్గాలకు మళ్లీ అన్యాయం
- ఈ సారి ఎక్కువ సీట్లు ఇస్తామని ప్రకటనలు
- ఉమ్మడి జిల్లాలో ఈ వర్గానికి ఒక్కటే సీటు
- 2018 ఎన్నికల్లో మూడు స్థానాల్లో చాన్స్
- కాంగ్రెస్‌పై మండిపడుతున్న బీసీ వర్గాలు

వరంగల్, అక్టోబర్ 29(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వెనుకబడిన వర్గాలను కాంగ్రెస్ పార్టీ మరోసారి మోసం చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ టికెట్లు ఇస్తామని ప్రకటిస్తూ వచ్చిన కాంగ్రెస్ అధిష్ఠానం... అదనపు టికెట్లు ఇవ్వకపోగా, గతంలో కంటే ఈసారి తక్కువ మంది బీసీలకు అవకాశం ఇచ్చింది. బీసీ డిక్లరేషన్ అని గొప్పగా చెప్పిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఈ వర్గం వారికి ఇచ్చే సీట్లలోనే భారీగా కోత పెట్టింది. ప్రతి లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో కచ్చితంగా రెండు సీట్లను బీసీలకు ఇస్తామని కాంగ్రెస్ జాతీయ నేతలు ప్రకటించారు. బీసీ నేతలతో సమావేశాలు నిర్వహించి ప్రకటనలు చేయించారు. తీరా టికెట్ల కేటాయింపులో మాత్రం బీసీలకు అన్యాయం చేశారు. ఒక లోక్‌సభ సెగ్మెంట్‌లో కాదు కదా... వరంగల్ ఉమ్మడి జిల్లా మొత్తంలో ఒక్క సీటునే బీసీలకు ఇచ్చారు. గతంలో కంటే ప్రస్తుత ఎన్నికల్లో ఎక్కువ సీట్లు బీసీలకు ఇస్తామని పదే పదే ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఈ వర్గానికి సీట్లను పెంచకపోగా సగానికి సగం తగ్గించింది. బీసీలకు రాజకీయంగా అవకాశాలు తగ్గించిన కాంగ్రెస్ పార్టీపై ఈ వర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. కాంగ్రెస్ బీసీల వ్యతిరేక పార్టీ అని ఈ వర్గం నేతలు చెబుతున్నారు. రాజకీయాల్లో తమకు అవకాశాలు కల్పించని పార్టీని తాము పట్టించుకోబోమని అంటున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు బీసీలను పట్టించుకోలేదని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ అలాగే వ్యవహరిస్తున్నదని విమర్శిస్తున్నారు. సామాజికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా బీసీ వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అనివార్యత ఉన్నది.. ఈ వాస్తవాలను విస్మరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అంటున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ రిజర్వు స్థానాలు మినహా ఏడు జనరల్ సెగ్మెంట్లు ఉన్నాయి. కాంగ్రెస్‌లో మొదటి నుంచి వరంగల్ ఉమ్మడి జిల్లాలో బీసీలకు ప్రాతినిథ్యం ఉండేది. ప్రస్తుత పీసీసీ నాయకత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు అవకాశాలను తగ్గిస్తూ వస్తున్నది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో బీసీలపై నిర్లక్ష్య వైఖరి ఇంకా ఎక్కువగా కనిపిస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ప్రక్రియ మొదలైన పట్టి నుంచి ఉమ్మడి జిల్లాలో బీసీలకు కాంగ్రెస్ నాయకత్వం అన్యాయం చేస్తున్నది. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జనగామ, వరంగల్ తూర్పు స్థానాలను బీసీలకు కేటాయించింది. 2018లోనూ బీసీలకు ఒక స్థానం పెంచింది. గత ఎన్నికల్లో జనగామ, వరంగల్ తూర్పు, పరకాల సీట్లను బీసీలకు కేటాయించింది. కాంగ్రెస్ అధిష్ఠానం, పీసీసీ నాయకత్వం ప్రకటనలతో వరంగల్ ఉమ్మడి జిల్లాలో బీసీలకు గతంలో కంటే ఎక్కువ సీట్లలో అవకాశం వస్తుందని ఈ వర్గం నేతలు భావించారు. ఏడు జనరల్ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. వీటిలో ఒక్క వరంగల్ తూర్పు స్థానంలోనే బీసీ వర్గానికి అవకాశం కల్పించింది. 2014 ఎన్నికలతో పోల్చితే ఒక సీటు, గత ఎన్నికలతో పోల్చితే రెండు స్థానాలను బీసీలకు తగ్గించింది. గతంలో కంటే ఎక్కువ స్థానాలు ఇస్తామని ప్రకటించిన పార్టీ ఇప్పుడు పైసలు, పలుకుబడి ఉన్న వర్గాలకే టికెట్లు ఇచ్చిందని బీసీ వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. బీసీలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో సరైన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు.

# తూర్పు కాంగ్రెస్‌లో అసంతృప్తి

- సురేఖ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్న కొందరు నేతలు
- ఆమె స్థానికురాలు కాదని అధిష్ఠానంపై గుర్రు
- మాజీ డిప్యూటీ మేయర్ నేతృత్వంలో నిరసన గళం

వరంగల్, అక్టోబర్ 29(నమస్తేతెలంగాణ) : వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీలో అసమ్మతి రాగం వినిపిస్తున్నది. తమ పార్టీ అధిష్ఠానం ఇక్కడి నుంచి మాజీ మంత్రి కొండా సురేఖ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంపై అసంతృప్తి వెలిబుచ్చుతున్నారు. స్థానికురాలు కాని సురేఖకు పోటీ చేసే అవకాశం కల్పించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. తూర్పు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని పలువురు నేతలు ఆశించారు. తమకు టికెట్ కేటాయించాలని అధిష్ఠానానికి దరఖాస్తు చేశారు. వీరిలో సురేఖతో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ తదితరులు ఉన్నారు. ఎవరికి వారే పార్టీలోని తమ గాడ్‌ఫాదర్ల ద్వారా కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నించారు. ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలని తమకు ఉన్న పలుకుబడిని ఉపయోగించారు. పోటీ ఉండడం వల్ల కాంగ్రెస్ అధిష్ఠానం తొలి విడుత 55 మంది అభ్యర్థులతో ఇటీవల విడుదల చేసిన జాబితాలో తూర్పు నుంచి ఎవరికీ చోటు కల్పించలేదు. తాజాగా శుక్రవారం మరో 45 మంది అభ్యర్థులతో రెండో జాబితా విడుదల చేసింది. ఇందులో కొండా సురేఖ పేరు ప్రకటించింది. దీంతో ఈ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నేతలు కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పొరుగు నియోజకవర్గానికి చెందిన సురేఖకు ఇక్కడ టికెట్ ఇవ్వడాన్ని తప్పు పడుతున్నారు. ఎంబాడి రవీందర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు కొందరు శనివారం రాత్రి వరంగల్ ఎల్బీనగర్‌లో సమావేశమయ్యారు. వీరిలో ఓ మాజీ కార్పొరేటర్‌తో పాటు ఈ నియోజకవర్గ ఎన్నికల కో ఆర్డినేటర్ ఒకరు ఉన్నట్లు తెలిసింది. తూర్పు అభ్యర్థినిగా సురేఖను ప్రకటించడంపైనే ప్రధాన చర్చ జరిగినట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశించిన స్థానికులను పక్కనపెట్టి వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఉండే సురేఖకు టికెట్ ఇవ్వడంపై పార్టీ నేతలు నిరసన వెలిబుచ్చినట్లు తెలిసింది. ఆమె స్థానంలో స్థానికులైన మరొకరిని బరిలో నిలపాలని, లేకుంటే స్థానికుల్లో ఒకరిని స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దింపాలని సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. పార్టీ అధిష్ఠానం స్పందన చూశాక మరోసారి సమావేశం కావాలనే ఆలోచనలో వీరు ఉన్నట్లు తెలిసింది. ఈ పరిణామాలు తూర్పులో రాజకీయంగా ఆసక్తి రేపుతున్నాయి.

## ఓటెయ్యాలని వృద్ధురాలికి డబ్బుల పంపిణీ

- రూ.500 అందజేసిన కాంగ్రెస్ తూర్పు అభ్యర్థి కొండా సురేఖ
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో

కరీమాబాద్, అక్టోబర్ 29 : కాంగ్రెస్ పార్టీ వరంగల్ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి కొండా సురేఖ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ ఓ డివిజన్‌లో డబ్బులు పంపిణీ చేసిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. వృద్ధురాలిని పలకరించిన కొండా సురేఖ తమ పథకాలకు సంబంధించిన కరపత్రం చాటున రూ.500 ఉన్నాయని చెబుతున్న వీడియో 2 రోజులుగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ఏడు కిలోల గంజాయి స్వాధీనం

కాజీపేట, అక్టోబర్ 29 : విశాఖపట్నం నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న మహబూబ్ నగర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించి ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం కాజీపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. వైజాగ్-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి రవాణా అవుతున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రావులకు వచ్చిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని రవాణా చేస్తున్న వ్యక్తులు దొరకలేదన్నారు. తనిఖీల్లో కాజీపేట ఎక్సైజ్ ఎస్సై తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ ఖలీల్, రవీందర్, లాలయ్య, వీరమల్లు పాల్గొన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 8712659020 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.



రైల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

## పాము కాటుతో బాలుడి మృతి

ములుగురూరల్, అక్టోబర్ 29 : పాము కాటుతో బాలుడు మృతి చెందిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీలో ఆదివారం జరిగింది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన గుంజె రాజు-స్వాతి దంపతుల కుమారుడు నిఖిల్(12) శనివారం రాత్రి ఇంట్లో నేలపై నిద్రించాడు. తెల్లవారుజామున 2గంటలకు తీవ్ర అస్వస్థతకు గురై ఏడుస్తుండడంతో తల్లిదండ్రులు లేచి చూడగా నాగు పాము కనిపించింది. తమ కుమారుడు పాము కాటుకు గురయ్యాడని గ్రహించి వెంటనే చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించగా, పరీక్షించిన వైద్యులు నిఖిల్ అప్పటికే మృతి చెందినట్లు చెప్పారని తెలిపారు.

## ముగ్గురిపై కేసు నమోదు

గోవిందరావుపేట, అక్టోబర్ 29 : ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం, గుడుంబా విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పస్రా ఎస్సై షేక్ మస్తాన్ ఆదివారం తెలిపారు. మండలంలోని పాపయ్యపల్లి గ్రామానికి చెందిన సునావత్ రాజు, గాంధీనగర్ గ్రామానికి చెందిన కుంటవత్ సునీత గుడుంబా విక్రయిస్తున్నట్లు సమాచారం అందగా, వెళ్లి తనిఖీ చేశారు. వారిద్దరి వద్ద 10లీటర్ల చొప్పున గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా గోవిందరావుపేటకు చెందిన గట్ల నాగేశ్వర్‌రావు మద్యం విక్రయిస్తుండగా తనిఖీ చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## పురుగుల మందు తాగి గీత కార్మికుడి బలవన్మరణం



స్వామి(ఫైల్)

రఘునాథపల్లి, అక్టోబర్ 29 : ఆర్థిక ఇబ్బందులు తాళలేక గీత కార్మికుడు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన కోమల్లలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బండి స్వామి (41) గీత వృత్తితో పాటు దినసరి కూలీగా పని చేస్తుండేవాడు. ఈ క్రమంలో ఖర్చులు పెరిగి పోయి ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో తరుచూ మద్యం తాగి ఇంటికి వెళ్లడంతో గొడవలు జరిగేవి. శనివారం గ్రామ శివారుకు వెళ్లి పురుగుల మందు తాగాడు. స్థానికులు గమనించి జనగామ ఏరియా దవాఖానకు తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య రాధిక, కుమారుడు సన్నీ, కూతురు చందన ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

కాజీపేట, అక్టోబర్ 29 : జీవితంలో స్థిరపడలేదని ఓ వ్యక్తి విరక్తి చెంది వడ్డేపల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వెలుగు చూసింది. కాజీపేట సీఐ సార్ల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డేపల్లి చెరువులో మృతదేహం తేలి ఉన్నట్లు శనివారం సాయంత్రం స్థానికులు సమాచారం అందించారు. సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటికి తీసి వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపరిచారన్నారు. మృతుడి వద్ద దొరికిన సమాచారంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు ఇక్కడికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా, హఫీజ్‌పేట్, మార్తాండ నగర్‌కు చెందిన పిల్లి వెంకన్న కుమారుడు సాయి ప్రకాశ్(26) బీటెక్ చదివి, ప్రైవేట్ జాబ్ చేసి మానేశాడు. అతడికి సినిమాల్లో నటించడం అంటే చాలా ఇష్టం. కొన్ని సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లోనూ నటించాడు. 20 రోజుల క్రితం భద్రాచలం వెళ్తున్నానని ఇంట్లో చెప్పాడు. కానీ అక్కడికి వెళ్లకుండా ఇన్నాళ్లూ హనుమకొండలోని ఓ హాస్టల్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నెల 26న వడ్డేపల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించామని సీఐ చెప్పారు. తండ్రి వెంకన్న ఫిర్యాదుతో ఆత్మహత్య కేసు నమోదు, మృతదేహానికి పోస్ట్ మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని వివరించారు.

## గొడ్డలితో వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

రఘునాథపల్లి, అక్టోబర్ 29 : క్షణికావేశంలో ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేయడంతో తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని గిద్దెబండతండాలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధరావత్ వసురాం, దిరావత్ రవి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు సాగు చేసిన వరి కోతకు వచ్చింది. దీంతో వారి కోత మిషన్ కోసం రెండు రోజులుగా తిరుగుతున్న క్రమంలో ఒకరితో ఒకరు గొడవ పడ్డారు. క్షణికావేశంలో దిరావత్ రవి వసురాంపై గొడ్డలితో దాడి చేయగా, తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స కోసం వసురాంను జనగామ ఏరియా దవాఖానకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

## తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

వర్ధన్నపేట, అక్టోబర్ 29 : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కొత్తపల్లికి చెందిన గీత కార్మికుడు చిర్ర వెంకటయ్య(60) కల్లు తీసేందుకు వనంలోకి వెళ్లాడు. తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా మోకు జారడంతో కిందపడిపోయాడు. తోటి కార్మికులు ప్రమాద స్థలానికి వచ్చి చూడగా, వెంకటయ్య అపస్మారక స్థితిలో ఉన్నాడు. వెంకటయ్యను దవాఖానకు తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

గీసుగొండ, అక్టోబర్ 29 : గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట శివారులో పేకాడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అల్లం రాంబాబు తెలిపారు. వరంగల్‌కు చెందిన బెజ్జ కిరణ్‌కుమార్, గొర్రెకుంట గ్రామానికి చెందిన ఉండ్రాతి సందీప్, లేబర్ కాలనీకి చెందిన ప్రశాంత్, మర్రోజు రాజు పేకాడుతున్నారనే పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 10వేల నగదుతో పాటు నాలుగు బైక్‌లు, 4 సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తదుపరి చర్యల కోసం కేసును గీసుగొండ పోలీసులకు బదిలీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై వెంకన్న పాల్గొన్నారు.



పేకాడుతున్న వారిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు